
నిత్య వ్యాయామం.. సంపూర్ణ ఆరోగ్యం

- ఈతపై పెరుగుతున్న ఆసక్తి
- మక్కువ చూపుతున్న ప్రజలు

ప్రకాశం నగర్: మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరం. దానితోనే శారీరక ధృడత్వం చేకూరుతుంది. ప్రస్తుతం వాకింగ్, రన్నింగ్ వంటి రోజువారీ కనీస వ్యాయామాలు మనిషి జీవన శైలిలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. వీటితో పాటు మరికొందరు షటిల్, క్రికెట్, వాలీబాల్ తదితర క్రీడలు ఆడుతున్నారు. మరి కొందరు వ్యాయామ కళాశాలల్లో చేరి గంటల తరబడి వ్యాయామాలు చేస్తున్నారు. ముఖ్యంగా అధిక బరువు, పొట్ట వంటి సమస్యలు ఉన్నవాళ్లు తొందరగా అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో నగరవాసులు తమకు నచ్చిన వ్యాయామాలు ఎంచుకుని పాటిస్తున్నారు. అందరికీ మేలు చేసే తెలికపాటి వ్యాయామం స్విమింగ్. దీనిపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. అధిక బరువుతో వాకింగ్, రన్నింగ్ చేయలేని వారికి, మోకాళ్ల నొప్పులు ఉన్న మధ్య వయస్సు వారికి ఈత ఒక మంచి సాధనంగా మారుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. స్విమ్మింగ్ చేయడం వల్ల భుజాలు, వెన్ను, కాళ్లు, పొట్ట వంటి వాటికి మేలు జరుగుతుంది.



గోదావరిలో ఈత కొడుతున్న స్విమ్మర్లు

రూ.37 లక్షలతో చిన్నారుల స్విమ్మింగ్ పూల్

నగరంలోని పుష్కరాల రేవులో గోదావరి స్విమ్మర్స్ క్లబ్, రివర్ పూల్, స్పోర్ట్స్ క్లబ్ , ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్, రివర్ బే, స్నూకర్స్ జోన్ వంటి స్విమ్మింగ్ పూల్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో నగరపాలక సంస్థ సౌజన్యంతో 2009లో పుష్కరాల రేవులోని గోదావరి స్విమ్మర్స్ క్లబ్‌లో షవర్ బాత్‌రూమ్స్, లైబ్రరీ హాలును ప్రారంభించారు. నగరంలోని 8వ డివిజన్‌లో సుమారు రూ.37 లక్షల నగరపాలక సంస్థ సాధారణ నిధులతో జిల్లాలో మొట్టమొదటి చిన్నారుల స్విమ్మింగ్ పూల్, డ్రెసింగ్ రూమ్‌లను ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇతర క్రీడల్లో శిక్షణ ఇవ్వడంలో భాగంగా ఈతపై అభిరుచి ఉన్న చిన్నారులకు ఉదయం, సాయంత్రం వేళల్లో నాలుగు బ్యాచ్‌లుగా బాలలకు ఈతలో శిక్షణ ఇస్తున్నారు. ఈత నేర్చుకున్న విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి చదువులో రాణించగలరని స్విమ్మింగ్ కోచ్‌లు చెబుతున్నారు. గోదావరి స్విమర్స్ క్లబ్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి పతకాలు సాధించిన స్విమ్మర్లు ఉన్నారు.



స్విమ్మర్స్ క్లబ్ భవనం

ఆసక్తి పెరిగింది



గతంతో పోలిస్తే ఇప్పుడు స్విమ్మింగ్‌పై జనం బాగా ఆసక్తి చూపుతున్నారు. సుమారు 20 మంది సభ్యులుండే స్విమర్స్ క్లబ్‌లో ఇప్పుడు 80 నుంచి 90 మంది వరకు ఉన్నారు.35 ఏళ్ల నుంచి 65 ఏళ్ల వారు, ఈతలో పరిణితి చెందిన వారు ఉన్నారు. బీపీ, సుగర్, అధిక బరువు, కీళ్ల నొప్పులు ఉన్న వారికి స్విమింగ్ ఒక మంచి వ్యాయామం.

– వెల్లమశెట్టి రాజు,
గోదావరి స్విమ్మర్స్ క్లబ్ పర్యవేక్షకుడు

ముంపు సమస్య నివారణకు చర్యలు



గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

- డ్రైనేజీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: వచ్చే వర్షాకాలంలో ముంపు సమస్య లేకుండా నగర పాలక సంస్థ అధికారులు ఇప్పట్నుంచీ తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక 3వ డివిజన్ ఇన్‌చార్జి బళ్లా సత్యవతి ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేట్ ఎదురుగా నెహ్రూ నగర్ స్కూల్ సెంటర్ వద్ద నుంచి గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తమ వీధులన్నీ ముంపునకు గురవుతున్నాయని ప్రజలు చెప్పడంతో మున్సిపల్ ఇంజినీరింగ్, శానిటరీ, మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులతో కలసి పరిస్థితిని సమీక్షించారు. తక్షణమే మొదట కాలువలో పూడిక తొలగించాలని ఎంహెచ్‌ఓ వినూత్నకు సూచించారు. డ్రెయినేజీ ఆధునీకరణ పనులు చేపట్టడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేయాలని ఇంజినీరింగ్ అధికారుకు సూచించారు. ఆర్ట్స్ కళాశాల మెయిన్ గేటు వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే కళాశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఎంపీ సూచించారు. పన్నెండు మంది స్కూల్ పిల్లలతో వెళుతున్న ఆటోను ఆపి, డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బళ్లా శ్రీనివాసరావు, నక్కా నగేష్, కేబుల్ శ్రీనివాస్, పల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జల్ల కాలువ పనులు ప్రారంభించాలి

రాజమహేంద్రవరం రూరల్: జల్ల కాలువ గేటుకు నీటి పారుదలశాఖ మంజూరు చేసిన రూ.68 లక్షలతో త్వరితగతిన పనులు చేపట్టి, పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని వ్యవసాయ సలహా మండలి సమావేశం తీర్మానించింది. రాజమహేంద్రవరం రూరల్ సలహామండలి సమావేశం మండల చైర్మన్ కొత్తపల్లి కేశవ రామారావు అధ్యక్షతన శుక్రవారం తొర్రేడులో నిర్వహించారు. జల్ల కాలువ గేటుతో పాటు కాలువ పూడిక పనులు కూడా ప్రారంభించాలని సమావేశంలో రైతులు అధికారులను కోరారు. రెవెన్యూ శాఖ భూసర్వే త్వరితగతిన చేపట్టాలని కోరారు. ఏప్రిల్‌లో రైతువారీగా స్ప్రేయర్లు సరఫరా చేస్తామని వ్యవసాయాధికారి భీమరాజు తెలిపారు. తహసీల్దార్ పైడి చిన్నారావు, నీటిపారుదలశాఖ ఏఈ జి.ప్రసాద్ కుమార్, వెటర్నరీ సహాయ సర్జన్ పి.వెంకటరావు, వ్యవసాయ విస్తరణాధికారి పీటర్, వీపీఏలు నాగబాబు, శ్రీనివాస్, సురేఖ, వీఆర్‌వో కోన ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భీమరాజు

ఫార్మేటివ్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి

కంబాలచెరువు: స్థానిక కంటిపూడి రామారావు మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎం.తిరుమలదాస్ శుక్రవారం సందర్శించారు. ఫార్మేటివ్ 4 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఎనిమిదో తరగతి విద్యార్థుల ట్యాబ్‌లో బైజూస్ కంటెంట్ ప్రగతిని పరిశీలించారు. ప్రతి శుక్రవారం ట్యాబ్‌లను అప్‌డేట్ చేస్తున్నారా అని ఆరా తీశారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయులు అందరూ యాప్‌లో రోజూ హాజరును విధిగా నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంటిపూడి రామారావు స్కూలును పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి తిరుమలదాస్

మహిళల ఆత్మవిశ్వాసం అభినందనీయం

రాజమహేంద్రవరం సిటీ: నేటి మహిళలు అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా ముందుకు సాగుతున్నారని, వారి ఆత్మవిశ్వాసం ఆదర్శనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రకాశం నగర్ రౌండ్ పార్క్ వద్ద సుంకర భాస్కరరావు నగర పాలక ఉన్నత పాఠశాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్పృహ సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ కార్యక్రమం నిర్వహించారు. స్త్రీ అభ్యున్నతి - మనందరి బాధ్యత అనే అంశంపై మహిళాభ్యున్నతికి మనమందరం పోస్టర్ ఆవిష్కరించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్పృహ సైకాలజీ అల్యూమిని అధ్యక్షుడు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ నాగేంద్ర కిషోర్ మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. స్త్రీలను, ఆడపిల్లలను అవమానకరంగా చూపించే సోషల్ మీడియా, టీవీ సీరియళ్లను నియంత్రించే బాధ్యత కూడా విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రొబ్బి సన్యాసిరావు, స్పృహ సైకాలజిస్టులు పద్మజ భూషణ్, కర్రి శ్రావణి జ్యోత్స్న, విమల కుమారి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న స్పృహ సైకాలజిస్టులు

సావిత్రీబాయి సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సిటీ: మహిళల విద్యకోసం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే చేసిన కృషి చిరస్మరణీయమని పీస్ ఫర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు లంక సత్యనారాయణ అన్నారు. సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం అన్నపూర్ణమ్మ పేటలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- సావిత్రీబాయి పూలేని ఆదర్శంగా తీసుకుని మూల్ నివాసీలు అభివృద్ధి చెందాలని బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పితాని కోమల అన్నారు. స్థానిక సీతంపేటలోని బీసీ గరల్స్ హాస్టల్లో శుక్రవారం సావిత్రీబాయి సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు.



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులకు జరిమానా

కంబాలచెరువు: విధులకు ఆటకం కలిగించిన ముగ్గురు వ్యక్తులకు రూ.6 వేలు జరిమానా విధిస్తూ రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కరీముల్లా శుక్రవారం తీర్పునిచ్చారు. మెయిన్‌రోడ్డులోని నాగవరపు బుచ్చిఅబ్బాయి సత్రంలో అల్తాఫ్ హుస్సేన్, మహమ్మద్ ఇంతియాజుద్దీన్, మహమ్మద్ హఫీజుద్దీన్ దుకాణం లీజుకు తీసుకున్నారు. దుకాణం ఖాళీ చేయాలని దేవదాయశాఖ వారు నోటీసులు ఇచ్చారు. వారు ఖాళీ చేయకుండా విధులకు ఆటంకం కలిగించి చంపుతామని బెదిరించారు. దీనిపై దేవదాయశాఖ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసును సీనియర్ ఏపీపీ ఎస్.విజయ్‌కుమార్ వాదించగా, వన్‌టౌన్ సీఐ ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షించారు.

జీఎస్ఎల్‌లో ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్

రాజానగరం: జీఎస్ఎల్ వైద్య కళాశాల, ఆస్పత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు లభిస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో అత్యుత్తమ వైద్యసేవలు అందించి, వేలమంది ప్రాణాలను కాపాడారన్నారు. జీఎస్ఎల్ వైద్య కళాశాలలో రెండు రోజుల పాటు జరిగే ఏడవ జాతీయ ఫిజియోథెరపీ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఫిజియోథెరపీలో వస్తున్న మార్పులు, సవాళ్లు, కొత్త విధానాలు, అనుభవాల నుంచి నేర్చుకున్న ఈజీ మెథడ్స్‌పై ఈ సదస్సులో చర్చిస్తామని ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి.అప్పారావు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, కర్ణాటక హెల్త్ సైన్సెస్ యూనివర్సిటీ సిండికేట్ మెంబర్ డాక్టర్ యూటీ ఇఫ్తికార్ ఆలీ, ఏపీ స్టేట్ ఎలైడ్ హెల్త్ కేర్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.మాధవి, ఇండియన్ ఫిజియోథెరపిస్టు అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ కె.రుషివర్షిణి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.సురేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

డెల్టాలకు 7,350 క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు శుక్రవారం 7,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,170, మధ్య డెల్టాకు 1,410, పశ్చిమ డెల్టాకు 3,770 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 6.10 అడుగులకు చేరింది.

‘మా నమ్మకం నువ్వే జగనన్న’ ప్రతిధ్వనించాలి

- సీఎం జగన్‌తోనే అవినీతి రహిత పాలన
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదం ప్రతి ఇంటా ప్రతిధ్వనించాలని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో పాటు అవినీతి రహిత పాలన కొనసాగాలంటే మనుకున్న ఏకైక నమ్మకం ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక సీతానగరం బస్టాండ్ సెంటర్‌లోని గీతా బాలానీ థియేటర్‌లో శుక్రవారం సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల (జేసీఎస్) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం రాష్ట్రమంతటా 175 నియోజకవర్గాల్లో గృహసారథుల కార్యాచరణ ఒకేసారి మొదలవుతుందన్నారు. ఆ కార్యక్రమానికి కన్వీనర్లు, గృహసారథులు సంసిద్ధంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేసిన వలంటీర్లపై అపార విశ్వాసం ఉంచామని, ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలబెట్టామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండలంలో ముందెన్నడూ లేని విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని, ఈ వ్యత్యాసాన్ని గుర్తించి, ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి వైఎస్సార్ సీపీని ప్రజలు ఆశీర్వదించేలా గృహసారథులు కృషి చేయాలన్నారు.



సీతానగరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

చురుగ్గా రహదారి పనులు

రాజమహేంద్రవరం నుంచి సీతానగరం రహదారిని సుమారు రూ.105 కోట్లతో నాలుగు లైన్లు రహదారి పనులు చేపట్టామన్నారు. ఆగస్టు నాటికి రాకపోకలకు అనువుగా పనులు చేస్తామన్నారు. సీతానగరం పీహెచ్‌సీని 30 పడకల సీహెచ్‌సీగా అభివృద్ధి పరిచి, రఘుదేవపురం రోడ్డును ఆనుకుని నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. బొబ్బిల్లంకలో పీహెచ్‌సీని నెలకొల్పుతామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగునీటిని పుష్కలంగా అందిస్తున్నామన్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఆధునీకరణ, బొబ్బిల్లంక - ములకల్లంక బ్రిడ్జి నిర్మాణ తదితర పనులు జగనన్న ప్రభుత్వం కారణంగా సాధ్యమైందన్నారు. అనంతరం చినకొండేపూడిలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, నియోజకవర్గం బూత్ కమిటీల చైర్మన్, పార్టీ చేరికల కమిటీ కన్వీనర్ గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి), మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, వైస్ ఎంపీపీ-1 ముదునూరి సురేష్‌రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, సత్యం రాంపండు, కవల కృష్ణమూర్తి, మద్దాల కొండలరావు, సత్తి పండురాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మవారికి సప్తనదీ జలాభిషేకం



సప్తనదీ జలాన్ని తీసుకువస్తున్న మహిళలు

కడియం: కడియపులంకలోని పుంతలో ముసలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 108 కలశాలతో సప్తనదీ జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు కలశాలను తమ శిరస్సులపై పెట్టుకుని భారీ ఎత్తున ఆలయం వద్దకు తరలి వచ్చారు. మంగళవాయిద్యాల నడుమ వందల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లలితా సహస్రనామ పారాయణ చేశారు. అలాగే రాత్రి పంచ మంగళ హరతుల కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆయా కార్యక్రమాల్లో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ప్రతి రోజూ ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు.

బెంచ్ కం డెస్క్‌ల వితరణ



హైస్కూల్‌కు బెంచీలు అందజేస్తున్న గిరజాల వీర్రాజు

కడియం: స్థానిక ఉన్నత పాఠశాలకు ఆంధ్ర పేపర్‌మిల్లు వారు బెంచ్ కం డెస్కులను శుక్రవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) విజ్ఞప్తి మేరకు 125 బెంచ్ కం డెస్కులను కడియం హైస్కూలుకు, 25 మురమండ హైస్కూలుకు అందించారు. ఈ మేరకు హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం టి.సత్యనారాయణకు గిరజాల బాబు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, స్థానిక నాయకులు కుసునూరి బాబులు, కడియం గణేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు గండి స్వామిప్రసాద్ పాల్గొన్నారు.

వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలి



గౌతమీ జీవకారుణ్య సంఘాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి శుక్రవారం స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘాన్ని సందర్శించారు. అక్కడ వృద్ధులకు ఉన్న వసతులు, పరిసరాలు, వంటశాల, భోజనశాలలను పరిశీలించారు. వృద్ధులతో మాట్లాడారు. ఎలాంటి అసౌకర్యం ఉన్నా తెలియజేయాలన్నారు. ఎవరికైనా పింఛన్ లభించని పక్షంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు తెలియజేయాలని, తద్వారా వారి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. వేసవి కాలం ప్రారంభమైందని, వృద్ధులను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందికి తెలిపారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా కొండలరావు



రాజమహేంద్రవరం సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా యర్రంశెట్టి కొండలరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక హైటెక్ బస్టాండ్ పైన గల ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయంలో విశ్రాంత కార్యదర్శి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సకిలే సతీష్, సెక్రటరీగా జి.సత్యనారాయణ మూర్తి, కోశాధికారిగా ఏలూరి నారాయణ, జాయింట్ సెక్రటరీ, జాయింట్ కోశాధికారిగా రెండు పదవుల్లో ఉప్పు సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. వీరితో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. కొండలరావు మాట్లాడుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

పెదపూడి: మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులపై అవగాహన కలిగి ఉండాలని కాకినాడ ఎంఎల్ఎస్‌సీ ప్యానల్ అడ్వకేట్ కేవీఎస్ రత్నం అన్నారు. పెదపూడి సచివాలయం-1 వద్ద శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ కాకినాడ వారి ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. మహిళలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

ఆర్ట్స్ కళాశాలలో గెస్ట్ లెక్చర్

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ కళాశాల మహిళా సాధికారత కమిటీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం గెస్ట్ లెక్చర్ (అతిథి ఉపన్యాసం) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కృష్ణ ప్రారంభించారు. ప్రారంభ ఉపన్యాసంలో మహిళా సాధికారత ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఓపీ ఇందిర మాట్లాడుతూ ఆహార నియమాలు, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థినులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా సాధికారత కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం. పుష్పాంజలి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యమే సాధికారతకు మూలమన్నారు.

ఎస్‌కేఆర్ విద్యార్థినుల ఫీల్డ్ విజిట్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల బీకామ్ మొదటి సంవత్సరం విద్యార్థినులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులో భాగంగా శుక్రవారం ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో వాణిజ్య శాఖ విభాగం అధ్యాపకులు ఫెడరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి విద్యార్థినులను తీసుకువెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ జయంతి పద్మావతి మాట్లాడుతూ వేరియస్ ఫెడరల్ బీమా ఉత్పత్తులను వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రమోషనల్ మేనేజర్ జె.శ్రీనివాస్, వాణిజ్య శాఖ ఫ్యాకల్టీ మెంబర్లు మేజర్ డాక్టర్ బి.కల్యాణి, సత్యవాణి, వి.సూరిబాబు ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా ఏర్పాటు చేసిన ఎర్రటి తెర

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పురైల్వేస్టేషన్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కల్వర్టుకు పిట్టగోడలు లేకపోవడంతో శుక్రవారం ‘సాక్షి’లో ప్రమాదకరంగా కల్వర్టు అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి జి.వెంకటరావు ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కల్వర్టు వద్ద ఎర్రటి తెరను ఏర్పాటు చేశారు. దీని వల్ల కొంతమేర ప్రమాదాలను నివారించవచ్చని, కల్వర్టు నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టికి ఉన్నతాధికారుల ద్వారా తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

ముసలమ్మ అమ్మవారికి పూజలు



జక్కంపూడి రాజా, నాగేశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కడియం: కడియపులంకలో కొలువైన పుంతలో ముసలమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా వారికి గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. వారి వెంట స్థానిక పార్టీ నాయకులు ఉన్నారు.

13న వాహనాల వేలం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పరిధిలో సారా, ఇతర నేరాల్లో పట్టుకున్న 21 మోటారు వాహనాలకు ఈనెల 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు, రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకున్నవారు పాడిన మొత్తాన్ని 18 శాతం జీఎస్‌టీతో చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 96187 33879, 93981 90039 నంబర్లను సంప్రదించాలన్నారు.

రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

మధురపూడి: రబీ ధాన్యం కొనుగోలుకు వ్యవసాయ శాఖ సిబ్బంది సన్నద్ధం కావాలని కోరుకొండ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ క్రొవ్విడి సర్రాజు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాలులో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. అధ్యక్షతన వహించిన క్రొవ్విడి సర్రాజు మాట్లాడుతూ ఖరీఫ్‌లో మండలంలో 13,600 ఎకరాల విస్తీర్ణంలో పండించిన 6 వేల మంది రైతుల నుంచి 20 వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి 5,500 ఎకరాల విస్తీర్ణంలో పంటలకు ఈ-క్రాఫ్ నమోదు చేశామన్నారు. ప్రభుత్వం ద్వారా పచ్చిరొట్ట, పిల్లి పెసర విత్తనాలను ఈ నెలాఖరుకు రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. వైఎస్సార్ యాప్‌లో సిబ్బంది విధిగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశాఖ ఏడీఏ బీకే మల్లికార్జునరావు, కోరుకొండ తహసీల్దార్ పాపారావు, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ శాఖ కోరుకొండ మండల అధికారి గౌరాదేవి, పశుసంవర్ధకశాఖ వైద్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.